ఉదయ్ షోడా ఒకటి కొట్టించుకుని తాగాడు. మరో సోడా ఒకటి ముఖం మీద చల్లుకున్నాడు.

"దొంగతనం చేయటం అంత తేలిక కాదు" అన్నాడు ఉదయ్.

సర్కిల్‌కి ఆశాభంగమైంది. అంతేనా అన్నట్లు చూస్తుండిపోయాడు.

"నేనడిగే ఏర్పాట్లు చేస్తే పగలే దొంగతనం చేస్తాను".

సర్కిల్ ఆనందోద్వేగంతో చూశాడు ఉదయ్‌వేపు.

"నిజంగానే అంటున్నాను. రాత్రిళ్ళు ఆ వీధిలో దొంగతనం చేయటం తెలివితక్కువతనం అవుతుంది. పగలే క్షేమం" ఉదయ్ సాలోచనగా అన్నాడు.

"నువ్వేది అడిగినా క్షణాల్లో చేసేస్తాను. అది మా బాస్ యుగంధర్ ఆజ్ఞ. చెప్పు ఏం ఏర్పాట్లు చేయాలి?"

ఉదయ్ చెప్పసాగాడు " ఆ వీధిలో, దాని వెనక వీధిలో ప్రతి ఇంటి కిటికిలకు దోమల్ని నిరోధించే మెష్‌లు బిగించి వున్నాయి. దాన్ని బట్టి ఈ ఏరియాలో దోమలెక్కువని తెలుస్తోంది. కనుక ముందు ఈ ప్రాంతంలోని దోమల్ని పారద్రోలేందుకు ప్రయత్నించాలి".

అతనేమంటున్నాడో సర్కిల్‌కి అర్థం కాలేదు.

"మున్సిపల్ కార్పోరేషన్‌కి చెందిన దోమల్ని చంపేసే స్ప్రే కావాలి. అలాంటిదే వ్యాన్ కావాలి.... నాకు మరో రెండు గంటల్లో ఆ వ్యాన్, నాలుగు విడి స్ప్రేలు, నలుగురు మనుష్యులు కావాలి. వాళ్ళు మీవాళ్ళే కావాలి, కాని వాళ్ళను గౌసుద్దీన్ ఇంట్లోని వ్యక్తులు గాని, సెంట్రీగాని గుర్తు పట్టకూడదు. అర్థమైందా?"

సర్కిల్‌కి అప్పటి క్కూడా ఉదయ్ పథకమేమిటో అర్థం కాలేదు. మొత్తానికి ఉదయ్ ఏదో పథకం వేస్తున్నట్లుగా ఊహించాడు సర్కిల్.

సరిగ్గా 3-30కి మున్సిపల్ కార్పోరేషన్ యూనిఫామ్ వేసుకుని సిద్దంగా వున్నాడు. వ్యాన్‌లో డ్రయివింగ్ సీట్‌లో ఆ నలుగురిలోని ఒక వ్యక్తి కూర్చున్నాడు.

సర్కిల్ చూస్తుండగానే వ్యాన్ సరాసరి నెహ్రూనగర్‌కేసి బయలుదేరింది.

0 0 0

గౌసుద్దీన్ అనీజీగా ఆఫీసర్స్ క్లబ్‌లో పచార్లు చేస్తున్నాడు. సరిగ్గా అదే సమయంలో వ్యాన్ నెహ్రూనగర్ రెండవ వీధిలోకి ప్రవేశించింది. ప్రవేశిస్తూనే వ్యాన్‌లోంచి యాంటి మస్కిటో లిక్విడ్ పొగ రూపంలో రాసాగింది.

వ్యాన్ స్పీడ్ తగ్గింది. ఓసారి వీధి చివరవరకూ వెళ్ళి వెనుదిరిగింది.

ఉదయ్ కళ్ళతోనే రడీగా వుండమని తన ప్రక్కనున్న డ్రయివర్‌ని హెచ్చరించి కేబిన్‌కి వెనుక వేపున్న గ్లాసులోంచి చూశాడు. ఉదయ్ ఆర్డర్స్ కోసమే ఎదురుచూస్తున్న మిగతా

ముగ్గురూ అతన్ని చూడగానే మౌనంగా తలలూపారు.

వ్యాన్ సరిగ్గా గౌసుద్దీన్ ఇంటి ముందాగింది. ముందుగా ఉదయ్ వ్యాన్‌లోంచి దిగి గౌసుద్దీన్ ఇంటిగేట్ దగ్గరకు వెళ్ళి సెల్యూట్ చేసాడు.

"అయ్యగారింట్లో కొంచెం ఎక్కువ స్ప్రే చేయించమని మా కమిషనర్ గారు చెప్పారు. ".. అన్నాడు ఉదయ్ వినయాన్ని నటిస్తూ.

సెంట్రీకి ఉదయ్‌మీద ఎలాంటి అనుమానం రాలేదు. పైగా మున్సిపల్ కమీషనరే ప్రత్యేకంగా తమయ్యగారింట్లో ఎక్కువ స్ప్రే చేయమనటం అతనికి గర్వంగా వుంది.

అసలు గౌసుద్దీన్ ప్రాపకం సంపాదించుకోవటం కోసం తనే కాకి దుస్తులు చూపించి భయపెట్టి ఎక్కువ స్ప్రే చేయించాలని వ్యాన్ వీధిలోనికి ప్రవేశించగానే అనుకున్నాడు ఆ సెంట్రీ.

ఉదయ్ కనుసైగనందుకున్న మరుక్షణం వ్యాన్‌లోని నలుగురు మనుషులు తలా ఒక స్ప్రేయర్ భుజానికేసుకుని బయలుదేరారు.

సెంట్రీ దారిచూపగా, ఉదయ్ ముందుగా యింట్లోకి ప్రవేశించాడు.

ప్రవేశిస్తూనే ఉదయ్ మిగతా నలుగురు తమ జేబుల్లోంచి కర్చీఫ్స్ తీసి ముక్కులకు అడ్డంగా పెట్టుకున్నారు.

అంతే... ఆ మరుక్షణం తెల్లటి మేఘాలు ఆ ఇంటిని చుట్టేశాయి. ఆ మేఘాల మధ్య కాలికి వస్తువులు అడ్డు రాకుండా చూసుకుంటూ మెరుపులా లోపలకు దూసుకుపోయాడు ఉదయ్. అలాగే మిగతా నలుగురు ఇంటిలోని తలో గదిలోకి దూసుకుపోయారు.

అప్పటికీ ఏ అనుమానం రాలేదు సెంట్రీకి. ఇంట్లో వున్న గౌసుద్దీన్ కుటుంబసభ్యులు అ పొగను కాసేపు భరిస్తే దోమలబాధ తప్పుతుందని భావించారు. సరిగ్గా ఇదే సమయంలో గౌసుద్దీన్ జీప్ యింటివేపు బయలుదేరింది.

స్ప్రే చేయటం మొదలెట్టిన నిమిషానికి సెంట్రీకి కళ్ళు మండాయి ముందుగా.

ఆ తరువాత క్రమంగా మెదడు మొద్దుబారుతుండగా చేతిలోని గన్‌ని తనకు తెలీకుండానే వదిలేసి నేలమీదకు జారిపోయాడు.

సరిగ్గా అప్పుడే అతనికి అనుమానం వచ్చింది. కేకేసేందుకు గన్‌ని ఎయిమ్ చేసేందుకు ప్రయత్నించి విఫలమై పోయాడు.

ఈలోపు గౌసుద్దీన్ కుటుంబసభ్యులు కూడా క్రమంగా కూర్చున్న వాళ్ళు కూర్చున్నట్లే సోఫాల్లోకి ఒరిగిపోయారు.

ఉదయ్ యిప్పుడు గౌసుద్దీన్ బెడ్‌రూంలో వున్నాడు. అతని చేతులకు కర్చీఫ్స్ చుట్టుకున్నాడు, ఓ సారి టైమ్ చూసుకుని సన్నగా విజిల్ వేశాడు ఉదయ్.

అంతే... నలుగురు వ్యక్తులు మెరికల్లా పనిచేసుకుపోసాగారు. ఇంట్లోకి ప్రవేశించిన అయిదు నిమిషాలకు బయటకొచ్చేశాడు ఉదయ్.

ఆ వెనుకే మిగతా నలుగురూ-- మరికొద్ది క్షణాలకు వ్యాన్‌బయలుదేరింది.

గౌసుద్దీన్ జీప్ నెహ్రు నగర్ చౌరస్తాలోకి ప్రవేశించింది.

చౌరస్తాలో వున్న ఓ రెస్టారెంట్‌లో మూల కూర్చుని రెండవ వీధికేసి చూస్తున్న సర్కిల్ గౌసుద్దీన్ జీప్‌ని చూసి ఉలిక్కిపడ్డాడు. ఉదయ్ వ్యాన్ యింకా ఆ వీధిలోంచి రాలేదు.

ఈలోపు అనుకోకుండా గౌసుద్దీన్ రావటం భయాన్ని కూడా కలిగించింది సర్కిల్‌కి.

అనుకున్నది అనుకున్నట్లు పన్నెండు నిమిషాల్లో పూర్తయిపోవాలి.

ఆల్‌రడీ పదకొండున్నర నిమిషాలయింది. మరో 20 క్షణాలే వుంది.

వ్యాన్ వస్తున్న సూచనలు లేవు.

ఎలా...? ఎలా ఈ ప్రమాదంనుంచి బయటపడేది? చురుగ్గా ఆలోచిస్తూనే చౌరస్తావేపు చూశాడు.

ట్రాఫిక్ సిగ్నల్ వద్ద జీప్ ఆగి వుంది.

గ్రీన్‌లైట్ వెలిగి గౌసుద్దీన్ జీప్ బయలుదేరేలోపే జీప్‌కి ఏదో అవరోధం కలిగించాలి.

ఎలా?

అంతలోనే తను కూర్చున్న కేఫ్ ముందున్న కిళ్ళీకొట్టు దగ్గర ఒక పాతకేడి కనిపించాడు.

అంతే.. సర్కిల్ చటుక్కున లేచి బయటకు వచ్చాడు వేగంగా. సర్కిల్‌ని చూస్తూనే కేడికి చెమటలు పట్టేసాయి.

“నీకేం భయం లేదు---చిన్నపని చేసిపెట్టు. ఇప్పుడు హఠాత్తుగా పరిగెత్తుకుంటూ వెళ్ళి రోడ్డుమధ్య స్పృహ తప్పి పడిపో. నిన్నేం చేయను. చేయనివ్వను. కమాన్ క్విక్”

సర్కిల్ మాటలు పూర్తవుతుండగానే దూసుకుపోయాడు.

మరో రెండు క్షణాల్లో గ్రీన్‌లైట్ వెలుగుతుందనగా సర్కిల్ పంపించిన మనిషి ఆ వేపు పనుండి పరిగెడుతున్నట్లు నటించి సరిగ్గా గౌసుద్దీన్ జీప్‌కి ఎదురుగా రోడ్ మీదకు జారిపోయాడు.

చూస్తుండగానే ట్రాఫిక్ జామ్ అయిపోయింది. అందరితోపాటు గౌసుద్దీన్ జీప్‌లోవున్న పోలీస్ సిబ్బందికూడా జీప్‌దిగి ఆ వేపు రాసాగారు.

సరిగ్గా అప్పుడే ఉదయ్ వ్యాన్ ఆ వీధిలోంచి బయటకు వచ్చింది. సర్కిల్ ఊపిరి తీసుకున్నాడు, ప్రమాదం తప్పినందుకు.

0 0 0

సర్కిల్ ఇప్పుడు బిజీగా వున్నాడు. ప్రతీ పత్రికకు ఫోన్ చేసి ఎ.ఎస్.పి. గౌసుద్దీన్ ఇంట్లో పట్ట పగలే దొంగతనం జరిగిపోయిందని చెప్పటం మొదలెట్టాడు. అరగంటకల్లా అదో ఫ్లాష్‌న్యూస్ అయిపోయింది.

సరిగ్గా ఆ రోజు సాయంత్రం 6.30 నిమిషాలకి దొర ఎవర్ని పంపించాలన్నది నిర్ణయించబోతుండుగా గౌసుద్దీన్ ఇంట్లో దొంగతనం అన్నవార్త సంచలన వార్త అయిపోయింది.

అన్ని ఈవినింగ్ ఎడిషన్స్‌లో ఆ వార్త, గౌసుద్దీన్ ఇంటి ఫోటోస్థానం

సంపాదించుకున్నాయ్.

యుగంధర్ ఐ.జి దొరను కల్సుకునేందుకు సిద్ధమవుతున్నాడు. ఉదయ్ తెలివితేటల పట్ల యుగంధర్ అడ్మైర్ అయ్యాడు.

ఎలాంటి సంఘర్షణ, రక్తపాతం, గందరగోళం లేకుండా ఎంత సునాయానంగా దొంగతనం చేసాడు.

యుగంధర్ బయటకొస్తుండగా సర్కిల్ ఎదురయ్యాడు.

"థాంక్యూ ఎలాట్ మిస్టర్ సర్కిల్ .... నా పోస్టింగ్‌కి మార్గం సుగమం అయింది" అన్నాడు జీప్ వేపు నడుస్తూ.

"ఇందులో నా గొప్పతనమేం లేదు సార్. అంతా ఉదయ్ తెలివితేటలే.

నేనిప్పుడు అర్జంటుగా వాళ్ళ ఊరికెళ్ళి వాళ్ళ ఇంటి అడ్రస్ వెతికి పట్టుకోవాలి. లేదంటే ఆ ఉదయ్ నా మీద తిరగబడే ప్రమాదం వుంది" అన్నాడు సర్కిల్ యుంగంధర్ వెనకే జీప్‌వరకు నడుస్తూ.

"నో ప్రాబ్లమ్...రేపే నాకు పోస్టింగ్ ఆర్డర్స్ వస్తాయి. ఒకసారి నేనక్కడకు వస్తే ఉదయ్ ఇంటి అడ్రస్ అంత కష్టమైందేం కాదు. డోంట్ వర్రీ... నిన్నుకూడా నా దగ్గరకే లాక్కుంటాను. అక్కడవున్న పోలీస్ సిబ్బంది అంతా మధుమూర్తి, పట్టాభికి లొంగిపోయినవాళ్ళే. ఎవర్ని నమ్మాలో ఎవర్ని నమ్మకూడదో తెలీని పరిస్థితి నాకు ఎదురు కావచ్చు అక్కడకు వెళ్ళగానే. అందుకే నేను వెళ్ళిన వారానికి నీకు అక్కడకే ట్రాన్స్‌ఫర్ అయ్యేలా చూస్తాను. కాని ఒకటి గుర్తుపెట్టుకోవాలి.

నువ్వు నా మనిషిగా రావు. వచ్చాక కూడా నేనంటే పడనట్లు నటించాలి. అవసరం వస్తే ఓ దశలో నాతో గొడవ కూడా పడాలి. చాపక్రింద నీరులా శత్రువుల్ని తుదముట్టించుకుంటూ వెళ్ళాలి. ఈ యుద్ధంలో బ్రతికామా పోలీస్ వ్యవస్థకో కొత్త అర్థం చెప్పవచ్చు. పోయామా, విధి నిర్వహణలో పోయిన వృత్తిపరమయిన తృప్తి మిగులుతుంది. అన్నీ ఆలోచించుకుని ఒక నిర్ణయానికి రావాలి" యుగంధర్ స్టీరింగ్ ముందు కూర్చున్నాడు.

జీప్ వెళ్ళేవరకు అక్కడేవుండి ఆ తరువాత ఉదయ్ వుండే లాడ్జి కేసి బయలుదేరాడు.

కోరికోరి పులి బోనులోకి అడుగుపెట్టడమన్న సామెతకు ఇతనే ఉదాహరణ.

చూడాలి ఇది ఎంతవరకు వెళుతుందో?

0 0 0

మధుమూర్తి పెద్ద బిల్డింగ్ తీసుకున్నాడు. దానికి కావల్సిన హంగుల్ని సమకూర్చాడు.

పబ్లిసిటీ ప్రారంభమైంది భారీ ఎత్తున.

రోజుకొక ప్రకటన చొప్పున అత్యంత ఆకర్షణీయంగా కంపెనీ పేరు మధ్యతరగతి మిధ్యా జీవుల ఆశాసౌధాలకు ఊపిరి పోస్తున్నాయ్. కొత్త మారుతీ కారు...క్రీం కలర్ మారుతీకారు ఆ బిల్డింగ్ ముందు చెక్కలతో కట్టిన డయాస్‌మీద ఎక్కించి చుట్టూ సన్నని గొలుసుల్తో రక్షణ

ఏర్పాటు చేశారు.